బీఆర్ఏవోయూ ఉద్యోగుల సమ్మెబాట

- ఫైన్‌ఆర్ట్స్‌వర్సిటీకి స్థల కేటాయింపునకు వ్యతిరేకంగా నిరసన
- రిజిస్ట్రార్‌కు నోటీసు అందజేసిన జేఏసీ

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీకి స్థల కేటాయింపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఉద్యోగులు(బీఆర్ఏవోయూ) ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. స్థల కేటాయింపును నిరసిస్తూ సమ్మెకు దిగాలని నిర్ణయించారు. శనివారం వర్సిటీ రిజిస్ట్రార్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన పదెకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించింది. దీన్ని వ్యతిరేకిస్తూ వర్సిటీ ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. ఇప్పటికే జేఏసీగా ఏర్పడిన వర్సిటీ ఉద్యోగులంతా శనివారం మధ్యాహ్న భోజన సమయంలో వర్సిటీ పరిపాలన భవనం, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ పల్లవి కాంబ్లే, సెక్రటరీ జనరల్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. భూకేటాయింపును తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ పరిశోధక విద్యార్థులు, పూర్వ విద్యార్థులు సైతం భూ కేటాయింపును వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు.

23 నుంచి 27 వరకు స్వదేశీ మేళా

పీపుల్స్‌ప్లాజాలో 23న మెగా జాబ్ ఫెయిర్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 23 నుంచి 27 వరకు స్వదేశీ మేళాను నిర్వహించనున్నట్టు స్వదేశీ మేళా కన్వీనర్ బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ పీవీమార్గ్(నెక్లెస్‌రోడ్డు)లోని పీపుల్స్‌ప్లాజాలో మేళాను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 23న మెగా జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నామని, ఐటీ, ఫార్మా, నర్సింగ్, బ్యాంకింగ్, రిటైల్ రంగానికి చెందిన 100 కంపెనీల్లో పదివేలకు పైగా ఉద్యోగావకాశాలున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, పీజీ, ఫార్మా కోర్సులు పూర్తిచేసిన వారు జాబ్ మేళాకు హాజరుకావొచ్చని తెలిపారు. స్వదేశీ మేళా సందర్శనకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఐఏఎస్ అమోయ్‌కుమార్‌కు ఈడీ నోటీసులు

'మెట్ భూముల' అన్యాక్రాంతంపై 22 లేదా 23న విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): భూ కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం నోటీసులు జారీచేసింది. ఈ నెల 22 లేదా 23 తేదీల్లో విచారణకు రావాలని ఆదేశించింది. అమోయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సందర్భంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ రెవెన్యూ పరిధిలోని 17వ సర్వే నంబర్‌లో 386 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత అన్యాక్రాంతమైనట్టు ఆరోపణలు వచ్చాయి. ఇదే సర్వేనంబర్‌లోని ప్రైవేట్ భూమి 26 ఎకరాల్లో మెరుగు గోపాల్ యాదవ్ వెంచర్ వేసి సీలింగ్ ల్యాండ్‌ను కూడా కలుపుకున్నాడు. అయితే తమ భూమిలో గోపాల్ యాదవ్ వెంచర్ వేశాడని పలువురు రైతులు ఆరోపిస్తూ అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నామని, తమ పేరిట పట్టాలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో ఈ వ్యవహారంపై నిగ్గుతేల్చేందుకు ఈడీ రంగంలోకి దిగింది. ఈ క్రమంలో అమోయ్‌కుమార్‌కు నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని నిర్దేశించింది.

ఆరుగురితో విద్యాకమిషన్ సలహామండలి

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యా కమిషన్‌కు అనుబంధంగా ఆరుగురు సభ్యులతో అడ్వైజరీ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విద్యావేత్తలు, ప్రొఫెసర్లు జీ హరగోపాల్, కే మురళీ మనోహర్, వెంకటనారాయణ, ఎస్ సుజాత, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్ వెంకట్ రెడ్డి, యూనిసెఫ్ ప్రతినిధి కేఎం శేషగిరితో కూడిన సలహామండలిని ఏర్పాటు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని విద్యా కమిషన్ చైర్మన్‌గా నియమించగా, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, చారగొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డిని కమిషన్ సభ్యులుగా నియమించారు.

కొల్లూర్‌లోని కేసీఆర్ నగర్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం, (ఇన్‌సెట్)లో కుల్‌దీప్‌నారాయణ్

డబుల్ బెడ్రూం ఇండ్లు భేష్

- కేంద్ర హౌసింగ్ శాఖ జాయింట్ సెక్రటరీ కుల్‌దీప్‌నారాయణ్ ప్రశంసలు
- కొల్లూర్ డబుల్ బెడ్రూం ఇండ్ల సందర్శన

రామచంద్రాపురం, అక్టోబర్ 19: సంగారెడ్డి జిల్లా కొల్లూర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల ఎంతో బాగున్నాయని కేంద్ర హౌసింగ్ శాఖ జాయింట్ సెక్రటరీ కుల్‌దీప్‌నారాయణ్ ప్రశంసించారు. శనివారం ఆయన కొల్లూర్-1, కొల్లూర్-2 కేసీఆర్ నగర్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్ల సమూదాయాలను పరిశీలించారు. ఆయా సమూదాయాల్లో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లు, రోడ్లు, లిఫ్టులు, వాటర్ సంప్‌లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్లు తదితర వసతులను పరిశీలించి ప్రాజెక్ట్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇండ్లు ఎలా ఉన్నాయి? ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి? అని అడిగారు. లబ్ధిదారులు చాలా సంతోషంగా డబుల్ బెడ్రూం ఇండ్లు బాగున్నాయని చెప్పారు. ప్రతినెలా కిరాయి కట్టే పరిస్థితి లేదని, సొంతింట్లో సగౌరవంగా బతుకుతున్నామని సమాధానమిచ్చారు. వాటర్, కరెంట్ అన్ని వసతులను ఏర్పాటు చేశారని, తమకంటూ సొంతింటిని కేసీఆర్ సార్ ఇచ్చారని కొనియాడారు. కొల్లూర్ డబుల్ ఇండ్లను ప్రత్యక్షంగా చూసిన కుల్‌దీప్‌నారాయణ్ సైతం సంతోషంగా వ్యక్తం చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాజెక్ట్ చాలా బాగున్నదని అభినందించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న హౌసింగ్ స్కీమ్‌లపై అధ్యయనం చేసేందుకు ఆయన పర్యటిస్తున్నట్టు తెలిసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల నుంచి రూపాయి తీసుకోకుండా అద్భుతమైన డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాజెక్ట్ నిర్మించి పేదల సొంతింటి కలను నెరవేర్చడం చూసి సంబురపడ్డారు. ఆయన వెంట రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, సీడీఎంఏ, వీపీ గౌతమ్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్‌నాయుడు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు క్రీమీలేయర్ అమలుచేయొద్దు

- రిజర్వేషన్లను 23 శాతానికి పెంచాలి
- 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకోవద్దు
- ఎస్సీ వర్గీకరణపై ప్రజాసంఘాల, దళితుల డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్19 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ వర్గీకరణకు క్రీమీలేయర్‌ను అమలుచేయవద్దని, 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకోకుండా కులగణన చేపట్టాలని ఎస్సీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు జారీ చేసిన తీర్పును అధ్యయనం చేసేందుకు, అమలుకోసం చేయాల్సిన సిఫారసులపై మంత్రి ఉత్తమ్ చైర్మన్‌గా ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సమావేశమై రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రజాసంఘాల అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎస్సీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌ను ఆదేశించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1850కి పైగా, ఆఫ్‌లైన్ ద్వారా 60కి పైగా దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. ఇప్పటివరకు వచ్చిన విజ్ఞప్తుల్లో చాలావరకు ఎస్సీ కులాల వర్గీకరణ శాస్త్రీయంగా కొనసాగించాలని కోరుతున్నట్టు తెలుస్తున్నది. మాదిగ, మాలతోపాటు ఎస్సీ ఉపకులాలుగా విభజించి రిజర్వేషన్లు ఖరారు చేయాలని కోరుతున్నట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఇప్పటివరకు వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం నియమించిన సబ్‌కమిటీకి, లేదంటే ఏకసభ్య కమిషన్ పరిశీలనకు పంపించేందుకు ఎస్సీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

బీసీ మేధావులతో కమిషన్ భేటీ

హైదరాబాద్, అక్టోబర్19 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ అంశంపై చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ నిరంజన్ ఖైరతాబాద్‌లోని తన కార్యాలయంలో బీసీ మేధావులతో శనివారం భేటీ అయ్యారు. రిజర్వేషన్ల నిర్ధారణకు కులసర్వే డేటా ప్రాతిపదికగా ఉండాలని, న్యాయ పరిశీలనను తట్టుకునేందుకు అధ్యయనంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని బీసీ మేధావులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

పోలీసుల వేధింపులకు గిరిజనుడు బలి?

- పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- దవాఖానలో చికిత్స పొందుతూ శ్రీను మృతి
- సీఐ, ఎస్సైని సస్పెండ్ చేయాలని మృతుడి బంధువుల ధర్నా
- జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్తత
- మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

పాలకుర్తి రూరల్/వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 19: కాంగ్రెస్ నేత ప్రోద్బలం.. పోలీసుల వేధింపులతో మనస్తాపం చెంది పోలీస్ స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఓ గిరిజన యువకుడు.. దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన మృతుడి కుటుంబ సభ్యులు, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం కొండాపురం శివారు మేకల తండాకు చెందిన లకావత్ శ్రీను (22)కు ఇదే మండలంలోని గూడూరు శివారు నర్సింగపురం తండాకు చెందిన సరోజతో తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గర్భవతిగా ఉన్న సరోజ ఈ నెల 16న జనగామలోని చంపక్ హిల్స్‌లోని దవాఖానకు వైద్య పరీక్షలకు వెళ్లింది. శ్రీను అక్కడ గొడవపడి భార్యను కొట్టడంతో సరోజ పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు విచారణ కోసం పిలవగా శ్రీను స్టేషన్‌కు వచ్చాడు. అక్కడ సరోజ, ఆమె బంధువులు కొట్టగా మనస్తాపం చెందిన శ్రీను శుక్రవారం పోలీస్ స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనును వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానలో చేర్చగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 6 గంటలకు మృతి చెందాడు. ఆగ్రహించిన మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజా సంఘాల నాయకులు పాలకుర్తిలోని పోలీస్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. శ్రీను కుటుంబానికి న్యాయం చేయాలని, ఎస్సై, సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్.. ఫోన్‌లో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో మాట్లాడించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా అందేలా కృషి చేస్తానని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎంజీఎం మార్చురీలో లకావత్ శ్రీను మృతదేహానికి మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. లకావత్ శ్రీను కుటుంబసభ్యులను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.15 వేల ఆర్థికసాయాన్ని అందించి, వారి కుటుంబానికి అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు.

ఎంజీఎం మార్చురీ వద్ద మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఇద్దరు చిన్నారుల కిడ్నాప్

- నిజామాబాద్ జీజీహెచ్ నుంచి బాలుడు, హుజూరాబాద్ పట్టణంలో బాలిక అపహరణ
- పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు.. కేసులు నమోదు

బాలుడిని ఎత్తుకెళ్తుండగా సీసీ కెమెరాలకు చిక్కిన నిందితులు

వినాయక్‌నగర్/హుజూరాబాద్, అక్టోబర్ 19: వేర్వేరు జిల్లాల్లో ఇద్దరు చిన్నారులు కిడ్నాప్‌నకు గురయ్యారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలానికి చెందిన రాజు, లక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజు భార్య అనారోగ్యంతో బాధ పడుతుండగా.. శుక్రవారం ఆమెను నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ దవాఖానకు తీసుకొచ్చాడు. వైద్య పరీక్షల సమయం దాటిపోవడంతో రాత్రి అక్కడే ఉన్నారు. దవాఖాన ప్రాంగణంలోని ఓ షెడ్డు కింద రాజు భార్య, ఇద్దరు పిల్లలతో నిద్రపోయాడు. అర్ధరాత్రి మెళకువ రాగా.. ఏడాది బాబు మణికంఠ కనిపించలేదు. దవాఖాన అంతటా వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దవాఖానలోని సీసీ కెమెరాల పుటేజ్‌ను పరిశీలించగా నిందితుల ఆనవాళ్లు దొరికాయి. మహిళ, యువతి, బాలిక ముగ్గురు కలిసి బాలుడిని ఎత్తుకుపోతున్న దృశ్యాలు సీసీ పుటేజ్‌లో రికార్డయ్యాయి. బాలుడి కోసం గాలిస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణం బుడగజంగాల కాలనీకి చెందిన ఓ బాలిక (16) కిడ్నాప్‌నకు గురైంది. శుక్రవారం సాయంత్రం కిరాణా షాపునకు వెళ్లొస్తానని ఇంట్లో నుంచి వెళ్లిన బాలిక ఇంటికి తిరిగి రాలేదు. బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళ పై సామూహిక లైంగిక దాడి

- నిజామాబాద్‌లో ఘటన
- ఆటోడ్రైవర్ నమ్మించి దారుణం

వినాయక్‌నగర్, అక్టోబర్ 19: నిజామాబాద్ జిల్లా కేంద్రానికి షాపింగ్‌కు వచ్చిన ఓ మహిళపై నలుగురు దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. తమ ప్రాంతానికి వెళ్లేందుకు ఆటో ఎక్కిన బాధితురాలిని కిడ్నాప్ చేసి దారుణానికి ఒడిగట్టిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. బోధన్‌కు చెందిన ఓ మహిళ శుక్రవారం షాపింగ్ కోసమని నిజామాబాద్‌కు వచ్చింది. షాపింగ్ ముగించుకుని బస్టాండ్‌కు చేరే సరికి రాత్రి 11 గంటలైంది. ఆ సమయంలో బస్సులు లేకపోవడంతో అక్కడ ఉన్న ఓ ఆటోను ఆశ్రయించగా అతను సరేనన్నాడు. అప్పటికే ఆటోలో మగవాళ్లు ఉండటంతో వారు ప్రయాణికులే అనుకుంది. ఆమె ఆటో ఎక్కగానే సదరు ఆటోడ్రైవర్ బోధన్ వైపు కాకుండా డిచ్‌పల్లి వైపు తీసుకెళ్లాడు. గమనించిన మహిళ ఇటు ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా, పక్కన కూర్చున్న వారు అరిస్తే చంపుతామంటూ భయపెట్టారు. డిచ్‌పల్లి-రాంపూర్ మార్గమధ్యంలో నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి నలుగురు కలిసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత నిజామాబాద్ బస్టాండ్ వద్ద దింపేసి వెళ్లిపోయారు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్‌హెచ్‌వో రఘుపతి కేసు నమోదు చేసుకున్నారు. బాధితురాలిని వైద్యం కోసం జీజీహెచ్‌కు తరలించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

కాలేజీకెళ్లకుండానే ఇంటర్ పరీక్షలు రాసే చాన్స్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): కాలేజీకెళ్లకుండానే ఇంటర్ పరీక్షలు రాసే అవకాశాన్ని ఇంటర్‌బోర్డు కల్పించింది. ఆర్ట్స్/హ్యూమానిటీస్ విద్యార్థులకు ఈ అవకాశమిచ్చింది. హాజరు మినహాయింపు కోసం రూ.500 ఫీజు చెల్లించి పరీక్షలు రాసుకోవచ్చు. నవంబర్ 20వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, డిసెంబర్ 18 వరకు రూ.200 ఫైన్‌తో మినహాయింపు పొందవచ్చని తెలిపింది.

విశాఖ శారద పీఠానికి ఏపీ సర్కారు షాక్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): విశాఖ శారద పీఠానికి ఏపీ ప్రభుత్వం షాకిచ్చింది. వైసీపీ సర్కారు ఇచ్చిన 15 ఎకరాల స్థలం అనుమతులను రద్దుచేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జగన్ ప్రభుత్వం రూ.220 కోట్ల స్థలాన్ని రూ.15 లక్షలకే శారద పీఠానికి అప్పగించిందని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం స్థలం అనుమతులను రద్దు చేసింది.

ఠాణాలో తల దువ్వాడని..గుండు గీయించారు!

- నాగర్‌కర్నూల్‌లో ముగ్గురు యువకులపై ఎస్సై దాష్టీకం
- మూడు రోజులు వెట్టి చాకిరీ.. ఆపై శిరోముండనం
- మనస్తాపంతో ఒకరి ఆత్మహత్యాయత్నం
- ఎవరికీ చెప్పొద్దని కుటుంబ సభ్యులపై పోలీసుల ఒత్తిడి
- తండ్రితో అనుకూలంగా వీడియో చిత్రీకరణ
- పోలీసులపై చర్యకు సర్వత్రా డిమాండ్

నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న గోపి శెట్టి వినీత్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు యువకుల మీద ఓ ఎస్సై జరిపిన దాష్టీకంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక పెట్రోల్ బంక్‌లో గొడవ చేశారని ఆ యువకులతో మూడ్రోజులపాటు పోలీస్‌స్టేషన్‌లో వెట్టి చాకిరీ చేయించిన ఎస్సై.. ఆపై వారికి శిరోముండనం చేయించడంతో.. ఓ యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ సంగతి బయటకు పొక్కడంతో సిబ్బందిని కాపాడుకొనేందుకు ఎస్సీ రంగంలోకి దిగారు. ఆయన ఎస్సైని వెనుకేసుకొని రావడం, ఆత్మహత్యకు యత్నించిన యువకుడి తండ్రి.. తప్పు తన కుమారుడిదేనంటున్న వీడియో బయటకు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ యువకుడి తల్లి మాత్రం ఎస్సై గుండు గీయించినందుకే తన కుమారుడు బలవన్మరణానికి ప్రయత్నించాడని మీడియా ముందు కుండబద్దలు కొట్టింది. దీంతో ఎస్సైపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు జోరందుకున్నాయి.

ఠాణాలో తల దువ్వాడని!

లింగాలలో ఈ నెల 13న పెట్రోల్ బంక్‌కు బైక్‌పై వచ్చిన ముగ్గురు రూ.20 పెట్రోల్ కొట్టమని అడిగారు. అంతతక్కువకు పెట్రోలు పోయలేమని సిబ్బంది చెప్పడంతో యువకులు గొడవకు దిగారు. వారు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆ మరుసటి రోజు ఉదయం ఎస్సై జగన్మోహన్ ఆ యువకులను స్టేషన్‌కు పిలిపించి మందలించాడు. ఇంతలో ఓ యువకుడు ఎస్సై ముందు తల దువ్వడంతో బండబూతులు తిట్టాడు. అంతేకాకుండా ఈ ముగ్గురికి గుండు గీయించాలని వారి తల్లిదండ్రులకు హుకుం జారీచేశాడు. ఆ తరువాత వారిని మూడు రోజులు స్టేషన్‌కు పిలిపించి స్టేషన్ పరిసరాలు శుభ్రం చేయించడం, బాత్‌రూమ్‌లు కడిగించడం చేయించారు. చివరి రోజు వారికి స్టేషన్‌లోనే గుండు గీయించారు.

'నాన్న ఎందుకు అడ్డు చెప్పలే' : వినీత్

'పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నాకు గుండు గీయిస్తుంటే మా నాన్న ఎందుకు అడ్డు చెప్పలేదు'.. అంటూ గోపిశెట్టి వినీత్ అనే బాధిత యువకుడు ప్రశ్నించాడు. లింగాలలో చాయ్ దుకాణం నడిపే వినీత్ తండ్రి సుధాకర్ తన కొడుకుకు పోలీసులు గుండు గీయించిన విషయం బయటకు చెప్పకుండా దాచి ఉంచాడు. దీంతో మనస్తాపం చెందిన వినీత్ శుక్రవారం ఉదయం ఇంట్లోనే ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించారు. దీంతో అసలు విషయం బయటపడింది.

గుండు కొట్టిచ్చినందుకే..

శిరోముండనంతోనే తన కొడుకు వినీత్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తల్లి హేమలత మీడియాకు స్పష్టంచేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే తండ్రి సుధాకర్.. తాను తిట్టినందుకే వినీత్ ఆత్మహత్యకు ప్రయత్నించాడని చెప్తున్న వీడియో బయటకు వచ్చింది.

ఎస్సై సెలవులో ఉన్నాడంటూ ఎస్పీ ప్రకటన

ఎస్పీ గైక్వాడ్ రఘునాథ్ వైభవ్ తమ సిబ్బందిని వెనకేసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్సై సెలవులో ఉన్నాడంటూ ఆయనను మీడియా కంటపడకుండా చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సీఐ రవీందర్.. ఈ వ్యవహారంపై విచారణ జరుగుతుందని, నిజమని తేలితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పడం గమనార్హం.

విద్యార్థులకు శిరోముండనం హేయం

- లింగాల ఘటనపై మాజీ ఎమ్మెల్యేలు గువ్వల, హర్షవర్ధన్‌రెడ్డి ఫైర్
- ఎస్సైపై క్రిమినల్ కేసుకు డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండలంలో ముగ్గురు విద్యార్థులకు ఎస్సై జగన్‌మోహన్ శిరోముండనం చేయించడం దారుణమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను చిత్రహింసలు పెట్టి గుండుకొట్టించారని, చట్టవ్యతిరేకంగా వ్యవహరించిన ఎస్సైపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత అభిలాశ్ రంగినేనితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎస్సై ముగ్గురికి గుండు కొట్టించడంతో వారిలో ఒకరు మనస్తాపానికి గురై శుక్రవారం ఆత్మహత్యకు యత్నించడంతో ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. ఘటనపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నోరు విప్పకుండా పోలీసులు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఇద్దరు విద్యార్థులు ఊరు విడిచి వెళ్లారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కేసులు పెడుతున్నారని, కొందరు పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా మారిపోయారని విమర్శించారు. పండుగలు, క్రీడాపోటీలు అధికార పార్టీ వాళ్లు మాత్రమే చేయాలని అంటున్నారని మండిపడ్డారు. యువకుల శిరోముండనంపై ప్రభుత్వం స్పందించాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఎస్సైపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో శ్రీధర్‌రెడ్డి హత్య నిందితులను ఎందుకు పట్టుకోలేదని నిలదీశారు. గ్రామాల్లో గొడవలు జరిగితే అధికార పార్టీ వారిపై కేసులు పెట్టడం లేదని, బాధితులపైనే తిరిగి కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎవరు తప్పు చేసినా పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



యాదగిరీశుడి క్షేత్రంపై 'హరి'విల్లు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంపై శనివారం ఇంద్ర ధనస్సు దర్శనమిచ్చింది. సాయంత్రం వర్షం కురిసిన కాసేపటికి స్వర్ణమయంగా ఉన్న దేవస్థానం మీద అద్భుతం ఆవిష్కృతమైంది. భక్తులు, స్థానికులు ఈ దృశ్యాన్ని తమ సెల్ ఫోన్లలో బంధించారు. – యాదగిరిగుట్ట